మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మొహరం పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో పీర్ల చావడిల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతరం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది అన్ని ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్బుక్, ట్యూటర్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో నారాయణపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670399 కి లేదా డయల్ 100 కి సమాచారమే వాళ్ళని తెలిపారు.

## అన్ని హంగులతో కళాశాల భవన నిర్మాణం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- బాలుర జూనియర్ కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త :** అన్ని హంగులతో ప్రభుత్వ బాలురజూనియర్ కళాశాల భవననిర్మాణం చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహ బూబ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను నిర్మించేందుకు కళాశాల ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆయన స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నిర్మాణానికి రూ.3.60కోట్ల నిధులను తీసుకురావడంతో పాటు,నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. రెండు అంతస్తులలో బాలుర జూనియర్ కళాశాల 9000ఎస్ఎఫ్టీలతో, ఒకేషనల్ జూనియర్ కళాశాల 18000 ఎస్ఎఫ్టీలతో అన్ని హంగులతో అధునాతన భవనాన్ని నిర్మించుకోవడం జరుగుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నిర్మాణాన్ని అసంపూర్తిగా నిర్మించి మధ్యలోనే వదిలిపోయారని మండిపడ్డారు. సుమారు ఎనిమిది నెలలు కష్టపడి టేబుల్ టు టేబుల్ వరకు ఫైల్స్ పట్టుకుని తిరిగి చివరికి ఈ రెండు కళాశాలల భవనాల నిర్మాణాలకు సంబంధించి అనుమతులు సాధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ విద్యాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాని నర్సింహులు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## భాగ్యనగరం దిశగా దేవరకద్ర మున్సిపాలిటీ

### దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మార్క్



ప్రాజెక్టు క్యారీడర్ ను అధికారులతో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**దేవరకద్ర, జూన్ 29 ప్రభాతవార్త :** దేవరకద్ర మున్సిపాలిటీ నగరానికి మహర్దశ అభివృద్ధి దిశగా మరో భాగ్యనగరం దిశగా దేవరకద్ర మున్సిపాలిటీ ఏర్పాటు. దేవరకద్ర పట్టణ ప్రజలు సంబరాలు జరుపుకునే రోజు చరిత్రలో ఇదొక అపూర్వ ఘటం. దేవరకద్ర నియోజకవర్గం ఏర్పడి 16 సంవత్సరాలు గడుస్తున్న ఈ ప్రాంత ప్రజలు వివిధ కేసుల నిమిత్తం మహబూబ్‌నగర్ కోర్టు చుట్టూ తిరుగుతుండడంతో ప్రజల అభీష్టం మేరకు గత ఎన్నికల్లో హామీ ఇచ్చి, గెలిచిన వెంటనే కోర్టు ఏర్పాటుకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నిరంతరం ప్రయత్నిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మంజూరు – మిగతా4లో..

# బురద జల్లడమే పనా..

- అసత్య ఆరోపణలు ఇకనైనా మానుకో
- 20నెలలుగా హామీలు అభివృద్ధికి గాలికి
- మా అక్క పేరు మీద భూమి ఉంటే చూపించు
- మా నాయకులు అవినీతి చేసుంటే నిరూపించు
- కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం కరెక్ట్ కాదు
- బాధ్యత గల పదవిలో ఉండి తప్పుడు ఆరోపణలు చేయొద్దు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, జూన్ 29, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నదని, గత ప్రభుత్వంపై తనపై ఆరోపణలు చేయడం తప్పా అభివృద్ధి, హామీల అమలు మీద దృష్టి సారించడం లేదని ఏదైనా పనులు చేసి పేరు తెచ్చుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. బాధ్యత గల వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయొద్దన్నారు.జడ్చర్ల రాజకీయాల్లో కుటుంబ సభ్యులను లాగడం ఎప్పుడు లేదని, జడ్చర్ల ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది తమకు చేతనైన అభివృద్ధి చేశామని, నీకు చేతనైన పనులు చేసి నిరూపించుకోవాలన్నారు. జడ్చర్ల ప్రేమ్ రంగా గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్న జరిగిన లయన్స్ క్లబ్ సమావేశంలో రాజకీయాలు మాట్లాడారని, తన మీద ప్రధానంగా చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

**పాతబజార్ రోడ్డు విషయంలో..**

నేషనల్ హైవే డిజైన్‌లోనే డైవర్షన్ ఉన్నది..పాతబజార్‌కు రోడ్డు ఉన్నది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కావాలనే రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఒకవేళరోడ్డు లేకుంటే ఎలా వెళ్లాలో చెప్పాలి, అధికారులతో మాట్లాడి రోడ్డు వేసేమార్గం చేయాలని కానీ రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నేషనల్ హైవేలు ఉన్నచోట్ల చాలా వరకు డైవర్షన్లు ఉంటాయని ఇది సర్వసాధారమన్నారు. సిగ్నల్ గడ్డ వద్ద కూడా ఐలాండ్ వద్ద రైట్ సైడ్ డివైడర్ ఓపెన్ ఉంటుందని అన్ని హెవీ వెహికిల్స్ వెళ్లడానికి అవకాశం ఉందని మరోసారి స్పష్టం చేశారు. సిగ్నల్ గడ్డ వద్ద రహదారి పనులు ఆలస్యంగా జరుగుతున్నాయనే విషయమై మీడియా ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే జాతీయ రహదారి తన పరిధిలో లేదని చెబుతున్నాడని, ఎన్నికలకు ముందు లక్ష్మారెడ్డి రోడ్డును పట్టించుకుంటలేదు అని ఆరోపణలు చేసి ఇప్పుడే తన గెలిచాక తన పరిధిలో లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాను తెలిచాకే జాతీయ రహదారి తన పరిధిలో లేకుండా పోతుందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పరిధిలో లేదంటూనే లక్ష్మారెడ్డి గతంలో డిజైన్ మార్పించాడంటూ ఇష్టమొచ్చినట్లు నిందలు వేయడం తనకే చెల్లుతుందన్నారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా ప్రజాప్రతినిధిగా సమస్యను పరిష్కరించే మార్గాలు వెతకాలి కానీ కావాలని పాతబజార్ ప్రజలను కన్ఫ్యూజ్ చేయడం ఎంటనీ మండిపడ్డారు.

**డబుల్ బెడ్రూం ఇండ్ల విషయమై..**

ఎర్రగుట్ట వద్ద గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలో ఇండ్లలో అనర్హులు ఉన్నారని ఎమ్మెల్యే మాట్లాడడం జరిగిందని, అనర్హులకే ఇండ్లు కేటాయించారని అంటున్నారని ఈ విషయంపై స్పందించారు. ఎన్నికల ముందు ఇండ్లు కేటాయించాల్సి ఉన్నందునా ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్లు ఇవ్వడం సాధ్యపడలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. అయితే ఎన్నికల తర్వాత కొందరు ఇండ్లలోకి వెళ్లి ఉంటున్నారని అధికారులు వెళ్లి విచారణ చేసి అనర్హులను వెంటనే ఇండ్లు ఖాళీ చేయించాలని అక్కడ ఇండ్లు కట్టిందే నిరుపేదల కోసమని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత కొందరు ఇండ్లలోకి వెళ్లి బలవంతంగా ఉంటే కూడా బీఆర్ఎస్ నాయకులు ఇండ్లను తీసుకున్నారని అనడం సరికాదని, బాజాప్త విచారణ చేసి ఏ పార్టీ వారున్నా అనర్హులుంటే తేల్చి చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు.

**దవాఖాన రోడ్డు విషయంలో..**

లక్ష్మారెడ్డి అక్క పేరు మీద రెండు ఎకరాల భూమి ఉందని ఎమ్మెల్యే మాట్లాడారని, ఉంటే చూయించాలని లక్ష్మారెడ్డి సవాలు విసిరారు. నోరు ఉందని ఇష్టమున్నట్లు మాట్లాడడం తనకే చెల్లుతుందని ఫైర్ అయ్యారు. జడ్చర్ల దవాఖానకు రోడ్డు లేకుండా చేశారని దాని మీద రాజకీయం చేయడం ఆరోపణలు చేయడం ఏంటని, నేషనల్ హైవే రావడం అక్కడ కల్వర్టు ఉండడం వల్ల రోడ్డు మరింత ఎత్తులోకి ఉండడం ద్వారా రోడ్డు డైవర్ట్ చేసి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు కూడా రోడ్డుకు డబ్బులు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. దవాఖాన పక్కనే మరో రెండెకరాల అసైండ్ ల్యాండ్ ఉందని ఎమ్మెల్యే చైతనైతే ల్యాండ్ ఓనర్లకు డబ్బులు చెల్లించి అందులో క్రిటికల్ కేరఖ యూనిట్ ప్రత్యేకంగా నిర్మించాలని సూచించారు. ఇప్పుడున్న దవాఖానలో చేపడుతున్న క్రిటికటల్ కేర్ నిర్మాణ పనులను ఆపేయాలని డిమాండ్ చేశారు. ఉద్దండపూర్ పరిహారం విషయం లో ఎలాంటి అవకతవకలు జరగలేదని...కెసిఆర్ గారిని ఒప్పించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ముప్పై శాతం పెంచామని గుర్తు చేశారు.మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.25లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు.

## ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకి 100 సంవత్సరాల వరకు ఎలాంటి ధోకా లేదు : ఎమ్మెల్యే

**గద్వాల టౌన్ , జూన్ 29, ప్రభాతవార్త:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కు వంద సంవత్సరాల వరకు ఎలాంటి ధోకా లేదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అపోహలు సృష్టించడం మానుకోండనీ , ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలి, తప్పుదోవ పట్టించే విధంగా ఉండకూడదనీ సూచించారు. ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రజలకు మేలు చేయాలనే ప్రయత్నిస్తాయి, హాని కలగాలని ప్రయత్నించదన్నారు. గద్వాల అభివృద్ధి కోసమే ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నానని అన్నారు. శనివారం గద్వాల నియోజకవర్గంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర మత్స్యకార , యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్ ను సందర్శించడం జరిగినదనీ, ఈ సందర్భంగా ఓ మాజీ శాసనసభ్యులు సీనియర్ నాయకులు మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో కూలిపోతాది. ఎక్కువ వాహనాలు తిరగడం వల్ల ప్రాజెక్టు కూలిపోతుందని ప్రజలకు భయాందోళన కల్పిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు . ఆది సరైన పద్ధతి కాదనీ, జూరాల ప్రాజెక్టులో కొంత సమస్యలు ఉన్న మాట వాస్తవమే కానీ ప్రాజెక్టు కూలిపోయేంత పరిస్థితి లేదన్నారు. సమస్య లేకపోయినా కూడా ప్రజలకు తప్పుడు మాటలు చెప్పి ప్రజలకు భయాందోళన కల్పించడం సరైన పద్ధతి కాదని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేయాలా ప్రాజెక్టుల్లో పూర్వ వైభోగం తీసుకురావడానికి కృషి చేయడం జరుగుతుందనీ, కానీ ప్రాజెక్టులను నాశనం చేయాలని ప్రాజెక్టులను రిజర్వాయర్లను పోతేపోనీ అని ఎవరు కూడా అనుకోరన్నారు . గత ప్రభుత్వంలో కూడా ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందనీ, ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కూడా ప్రాజెక్టులో ఉన్న చిన్నచిన్న సమస్యలను మరమ్మతులను పరిష్కరించే విధంగా, ప్రాజెక్టులకు , ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసే విధంగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు . ప్రాజెక్టు లోపలికి వెళ్లడానికి కూడా పరిస్థితి బాగాలేదని మాట్లాడడం సరైన పద్ధతి కాదనీ, విలేకర్లు కూడా మాతో పాటు వస్తే ప్రాజెక్టు లోపలికెళ్లి చూడవచ్చు. రేపు ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి లోపల ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు నిజనిజాలు చూపించే విధంగా మీడియా ద్వారా ప్రజలకు కూడా వాస్తవాలు చెప్పడానికి అవకాశం ఉంటుందన్నారు. సోమవారం జర్నలిస్టులు ప్రాజెక్టు దగ్గరికి వస్తే మేము తీసుకువెళ్లి వాస్తవాలను చూపిస్తామన్నారు . గద్వాల నియోజకవర్గంలో నేను ఏ పార్టీ అని విమర్శిస్తున్నారు . వారికి నేను సూటిగా సమాధానం చెప్తున్నాను నేను గద్వాల అభివృద్ధి కోసమే అధికార పార్టీకి మద్దతు తెలపడం జరిగిందనీ, గద్వాల నియోజకవర్గంలోని ప్రజలు ,రైతాంగం, వ్యాపారస్తులు అభివృద్ధి చెందాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గల కన్నా ముందు ఉండాలని సదుద్దేశంతో అధికార పార్టీలో భాగస్వాములై మద్దతు తెలపడం జరిగిందని ఆయన పేర్కొన్నారూ. నా చివరి శ్వాస వరకు గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ జి.వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్, నాయకులు గోవిందు, కురుమన్న ధర్మ నాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో దాడులు జరగలేదా..?

- అప్పడెందుకు స్పందించలేదు..
- అవసరమైతే సీబీఐ విచారణ చేపట్టండి
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** గతంలో మీడియా సంస్థల మీద దాడులు జరగలేదా..ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతుంది.. ఇంకా అవసరమైతే కేంద్ర బృందాలతో విచారణ చేయండి.. అంతేకానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం.. వార్తా కథనాలు అల్లడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. మీడియా వాళ్ల కుటుంబ సభ్యులపై ఇలాగే కథనాలు రాస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. వ్యక్తుల మీద దాడులు చేయలేదని, నాయకుల మీద అభిమానంతో దాడులు చేశారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలు చేసిన.. ఇబ్బందులకు గురిచేసిన ఆ మహిళల కుటుంబ సభ్యులు భరించారు.. ఎంతకైనా తెగిస్తారు అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగింది అంటూ విచారణలు చేస్తున్నారు.. అవసరమైతే కేంద్ర బృందాలతోనూ విచారణ జరిపించండి. పరవాలేదు.. కానీ కేటీఆర్ పై అభాండాలు వేస్తూ సొంత కథనాలు.. ప్రసారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడంతో బిఆర్ఎస్‌నాయకులు,కార్యకర్తలు ఆందోళనలు చేసే క్రమంలో జరిగిన చిన్న గొడవను కొంతమంది రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆ మీడియా సంస్థ కార్యాలయం అద్దం పగలవచ్చు.. కానీ మా నాయకులు.. కార్యకర్తల గుండెలు పగిలేలా కథనాలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయడం ఎంతవరకు న్యాయం అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. గతంలో అనేక పత్రిక కార్యాలయాలు.. జర్నలిస్టుల పై ప్రస్తుత అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేయలేదా..!? అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు మా హయాంలో ఇండ్లు ఇచ్చాం.ఇంకా కొందరుమిగిలిపోయారు. ఆ ఇండ్లపై విచారణ జరుపుతున్నారు. మిగిలిన వారందరికీ కూడా ఇవ్వవలసింది పోయి ఇండ్లు వచ్చిన వారిపై విచారణ జరుపుతున్నారు.ఇది ఎక్కడి న్యాయం అని మాజీ మంత్రి ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉట్కూర్‌లో భారీ ఈదురుగాలులు



వర్షం, ఈదురు గాలులకు కుప్పకూలిన చెట్లు

**ఉట్కూర్, జూన్ 29 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగల పై పడటంతో విద్యుత్‌కి అంతరాయం కలిగింది. చెట్లు విరిగిన విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది, అక్కడికి చేరుకొని, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో తీగలపైన పడిన చెట్లను తొలగించారు.

# జై తెలంగాణ కావాలా.. నై తెలంగాణ కావాలా ?

- తెలంగాణ ప్రజలు తేల్చుకోవాలి
  మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- అమరచింతలో సాయిచంద్ విగ్రహావిష్కరణలో
  పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు
  లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సాయిచంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో రజనీసాయిచంద్, మాజీ మంత్రులు

**ఆత్మకూర్, అమరచింత, జూన్ 29,ప్రభాతవార్త :** రాష్ట్రంలో జై తెలంగాణ నినాదంతో పనిచేసే ప్రభుత్వం కావాలా నై తెలంగాణ నినాదంతో పనిచేసే ప్రభుత్వం కావాలో ప్రజలు తేల్చుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు కోరారు. ఆదివారం వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు మండలంలోని అమరచింత పట్టణంలో జరిగిన రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ దివంగత సాయిచంద్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఆంధ్రా పాలకులు చేసిన కుట్రలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అధ్యక్షతన శాంతియుత పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నామని ప్రస్తుతం ఆంధ్ర పాలకుల కంటే హీనంగా ఒక్కరోజు కూడా జై తెలంగాణ అనని ఆ పరిస్థితి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలిస్తూ మరోసారి ఆంధ్ర పాలకుల పాట పాడడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం గోదావరి నీటిని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన్నుకు పోతుండగా గుడ్లప్పగించి చూస్తుందే కానీ నీటిని అడ్డుకునే ప్రయత్నం చేయకపోగా తెలంగాణ ప్రాంత రైతాంగానికి తీరని అన్యాయం చేసేందుకు కుయుక్తులు పన్నుతుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సొమ్మును ఢిల్లీ పాలకులకు పంపిస్తూ రాష్ట్రాన్ని దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఆదివారం జరిగిన బిజెపి సమావేశంలో సైతం కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఏటీఎంలో మారిందని చెప్పిన ఉదాహరణలను ఆయన సమావేశంలో ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సాయిచంద్ వర్ధంతి సభకు హాజరు కావడం తనకు ఎంతో బాధ కలిగిస్తుందని సాయి చందు లేని లోటును తెలంగాణ కళాకారులు గుర్తించి సాయి చందు ఆశయాలను సాధించేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశానికి రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచంద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్డు పక్కనే డ్రైనేజీ గుంత

**పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు**

**మద్దూర్, జూన్ 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీలో పాత బస్టాండ్ చౌరస్తా దగ్గర మెయిన్ రోడ్డుకు పక్కనే ఉన్న డ్రైనేజీ మోరి దానిపై ఎటువంటి మూత లేకపోవడంతో ఎంతోమంది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో గ్రామపంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు ఇప్పుడు నూతనంగా మద్దూర్ మున్సిపాలిటీ ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న మున్సిపాలిటీ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రతిరోజు ఇదే రోడ్డు మార్గం ద్వారా ఎంపీడీవో సిబ్బంది ఎమ్మార్వో సిబ్బంది పలువురు అధికారులు మున్సిపాలిటీ అధికారులు ప్రయాణం చేస్తున్న ట్లుగా వెళ్లిపోతున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపాలిటీ కమిషనర్ స్పందించి డ్రైనేజీ పై మూత బిగించాలని పలువురు మండల ప్రజలు మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే ప్రమాదకరంగా డ్రైనేజీ గుంత

## ప్రశ్నిస్తే మీడియాపై దాడులా..?

**మహా న్యూస్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన అరెళ్ల యాదయ్య**



**బాలానగర్, జూన్ 29 ప్రభాతవార్త :** సమాజంలో నాలుగో స్తంభంగా వెలుగొందుతున్న మీడియాపై బిఆర్ఎస్ శ్రేణుల దాడులను బాలానగర్ మండల అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి అరెళ్ల యాదయ్య తీవ్రంగా ఖండించారు. తెలుగు న్యూస్ ఛానల్ మహాన్యూస్ హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంపై దుండగులు దాడి చేసిన ఘటనపై ఆయన ఘాటుగా స్పందించారు. కర్రలు, రాళ్లతో ఆఫీస్ మీద దాడి చేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టారని, జరిగిన ఈ హింసా కాండలు టీవీలో చూస్తే సిగ్గనిపిస్తుందని అన్నారు. కర్రలతో ఆఫీస్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారని, దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల గొంతుకను వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలన్నారు. మహాన్యూస్ కార్యాలయం పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. టీవీలు, పత్రికలలో కథనాలు, ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని, వివరణ కోరవచ్చు కాని ఇటువంటి దాడులు సరైంది కాదు అని అన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో మీడియాపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త :** ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 1998,99 మార్కెట్ లైన్ పాఠశాల నారాయణ పేట ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక మార్కెట్ లైన్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక పూర్వ విద్యార్థులు విద్యార్థినిలు, పూర్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రోజు చాలా గొప్పరోజు అని ఎందు కంటే 10 వ. తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన మార్కెట్ లైన్ టీంను వారు అభినందించారు. అనంతరం గత 26 సంవత్సరం క్రితం చదువుకున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరున పలకరించుకున్నారు. ఇలాంటి సమ్మేళనం ప్రతి సంవత్సరం నిర్వహించాలని ప్రతి ఒక్క ఒక్కొక్క స్థాయిలో స్థిరపడ్డారు అని వారు పేర్కొన్నారు. అనంతరం ప్రతి విద్యార్థి మాట్లాడుతూ అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోవడం జరిగింది. పూర్వ ఉపాధ్యాయులు బస్వరాజు, వేణుగోపాల్, సుశీల మేడమ్ ,దత్తురావు,మార్కెట్ లైన్ పూర్వ విద్యార్థులు పోషల్ సంతోష్, నర్సింగ్ రావు, బుల్లెట్ సూరి,విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## మద్దిగట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

**భూత్పూర్,జూన్ 29,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలంలోని మద్దిగట్లలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం భూమి పూజ నిర్వహించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా కేసిరెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు మంజూరు చేసి నిర్మాణాలకు శ్రీకారం చుడుతోందన్నారు.దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ తన నియోజకవర్గంలో 3500ఇళ్లు చేయించి నిర్మాణాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం నామూనాలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.మద్దిగట్ల గ్రామంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో పాటు నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,తమన్నగౌడ్,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మద్దిగట్లలో ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గుపోసి ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి

## నేడు పేటలో జగన్నాథ రథయాత్ర ఉత్సవం

**నారాయణపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో ఈ నెల 30న సోమవారం హరే రామ హరే కృష్ణ మందిర్ ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆదిత్య నర్సింహదాస్ స్వామి తెలిపారు. పట్టణంలో మొట్ట మొదటి సారిగా ఈ రథయాత్ర నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సాయంత్రం 3 గం.లకు సరాఫ్ బజార్‌లోని బాలాజీ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని సెంటర్ చౌక్, వీర సావర్కర్ చౌరస్తా గుండా సత్యనారాయణ చౌరస్తా వరకు సాగుతుందని తెలిపారు. ఈ రథయాత్రలో ముఖ్య అతిథులుగా ఎంపి.డి కే.అరుణ,ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి,ముఖ్య వక్తగా వరదరాజ దాస్ ప్రభుజీ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రథయాత్ర కరపత్రాన్ని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, నర్సింహ దాస్, ఉమాకాంత్, శ్రీనివాస్ తదితరులు ఆవిష్కరించారు. పట్టణంలో మొట్ట మొదటి సారిగా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.


జగన్నాథ రథయాత్ర కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

## డిగ్రీ కళాశాలకు తీరిన తరగతి గదుల కొరత

**మక్తల్‌టౌన్,జూన్ 29 ప్రభాతవార్త :** మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అదనపు తరగతి గదుల కొరకు మంత్రి డా. వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి కళాశాలకు పక్కనే నిర్మించిన ఆరు నూతన గదులను కళాశాలకు అప్పగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాలకు నూతన భవనా న్ని నిర్మించి ఇవ్వనున్నట్లు మంత్రి స్ప ష్టమైన హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మంత్రి సూచన మేరకు మక్తల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట సురేష్ గుప్తా, గదుల తాళాలు కళాశా ల ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి, సహకరించిన నాయకుల కు, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌కు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జహంగీర్, తిరుపతి, రమేష్ గౌడ్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.


తరగతి గదులను పాఠశాలకు అప్పగిస్తున్న దృశ్యం

# అదనపు వంతెన ఏర్పాటు పట్ల పలువురు నేతల హర్షం

**ఆత్మకూర్ జూన్ 29,ప్రభాతవార్త;** ఆత్మకూరు మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ భాగాన అదనపువంతం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందంటూ రాష్ట్ర భారీ నీటి పరుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి ప్రకటించడం పట్ల ఉమ్మడి ఆత్మకూరు మండలంలో రాజకీయాల కత్తితంగా పలువురు నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 30 సంవత్సరాల క్రితం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై నిర్మించిన వంతెన కు సమానంగా దిగువ భాగాన రాకపోకల నిమిత్తం అదనపువంతం ఏర్పాటు చేయడం పట్ల ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు పై భారం పడకుండా ఉంటుందని పలువురు అధికారులు మొత్తం నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తేవడంతో తక్షణమే ఆయన భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి జూరాల ప్రాజెక్టు సందర్శించిన సందర్భంగా దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే మండలంలోని జూరాల గ్రామ సమీపంలో అదనపు వంతెన నిర్మించేందుకు 100 కోట్ల నిధులను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు ముఖ్యంగా ప్రస్తుతం కొత్తగా నిర్మించిన వంతెన మూలంగా కొత్తకోట చింతకుంట ఉమ్మడి ఆత్మకూరు మండలాల ప్రజలు గద్వాల్ చేరుకునేందుకు కేవలం 30 కిలోమీటర్ల పరిధిలోపే ఉంటుందని తద్వారా ప్రజలకు వ్యాపార లావాదేవీలు పెరగడమే కాకుండా పలు రకాలుగా ఉపయోగపడుతుందంటూ పలువురు వర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతంపై గ్రామాల ప్రజలు గద్వాల్ చేరుకోవాలంటే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఉన్నటువంటి వంతెన ద్వారానే వెళ్లాల్సి ఉంటుందని లేనిపక్షంలో ఎర్రవల్లి మీదుగా గద్వాల్ చేరుకునేందుకు అరవై కిలోమీటర్ల పరిధి అదనంగా మారడం పట్ల తీవ్రంగా నష్టపోతున్నారమంటూ పలువురు వ్యాపారస్తులు కూడా గత కొన్ని సంవత్సరాలుగా మదన పడుతున్నారు ఈ విషయంపై బిజెపి ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ప్రస్తుతం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి 300 కోట్ల నిధులతో చేపట్టనున్న అదనపు వంతెనకు తక్షణమే 100 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించినట్లుగా ప్రకటించడంతో అధికార పార్టీ నాయకులే కాకుండా ప్రతిపక్ష పార్టీల నాయకుల సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు అందులో భాగంగానే శనివారం రాత్రి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్ర ప్రస్తుత వర్ధక శాఖ మంత్రి వాకిడి శ్రీహరి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించి హర్షం వెల్లడించారు.


ఆత్మకూరులోని గాంధీ చౌరస్తాలో రాష్ట్ర మంత్రులకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

# మంత్రి ఆదేశానుసారమే డిప్యూటేషన్‌పై ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బదిలీ

**తగ్గిపోతున్న విద్యార్థుల చేరికలు.. ఉపాధ్యాయుడు బదిలీతో ఎస్సీ, బీసీ తల్లిదండ్రుల ఆవేదన..**

**వీపనగండ్ల ,జూన్ 28, ప్రభాతవార్త;**ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేసి పేద విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడినటువంటి విద్యా విధానాన్ని అందించాలని నిత్యం చెబుతున్న రాష్ట్ర ఎక్సైజ్ , టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వీపనగండ్ల జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ సంఘం, ప్రధాన నాయకుడు అయిన వ్యక్తిని బదిలీ చేయడానికి ఆయన రెఖమండేషన్ ప్రపోజల్తో వనపర్తి డీ.ఈ.ఓ .కు ఫోన్ ద్వారా చెప్పగా డి. ఈ. ఓ. దానికి తూచా తప్పకుండా డిప్యూటేషన్ పై వెళుతున్న ఉపాధ్యాయుని వెంటనే రిలీవ్ చేయాలని ఆ పాఠశాల ఉపాధ్యాయునికి సెలవు ఇచ్చాడు విషయంలోకి వెళ్తే వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 115 మంది విద్యార్థులు ఉన్నారు ఇందులో మొత్తం బీసీ ఎస్సీ విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు అయితే గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయులను నియమిస్తూ పాతవారిని ప్రమోషన్ మీద వివిధ పాఠశాలకు బదిలీలు చేయడం జరిగింది ఆ బదిలీల్లో భాగంగా వీపనగండ్లకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు వచ్చారు అయితే ఎస్సీ బీసీ పిల్లలు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న సందర్భంగా ఈ సంవత్సరం గత వారం రోజుల కిందట ఇంగ్లీష్ ప్రధానోపాధ్యాయుడు రోస్టర్ లో బదిలీపై వచ్చినప్పుడు ఆయనకు ఇబ్బంది జరిగింది. అనే నెపంతో రాష్ట్ర విద్యాశాఖ నుండి రాజకీయ పలుకుబడి ఉపయోగించి డిప్యూటేషన్ పై వనపర్తి ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేసుకొని ఒక లెటర్ తీసుకొని రావడం జరిగింది. అయితే దానితో స్థానికంగా ఉండే ప్రజలు ఆ ఇంగ్లీషు ఉపాధ్యాయుడు బదిలీ అయితే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఉపాధ్యాయ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. దానితో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు స్థానిక కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను పట్టుకొని వారి ప్రోత్బలంతో మంత్రి కృష్ణారావు తోటికి వెళ్లి విషయం చెప్పుకొని డి.ఇ.ఓ .నన్ను డిప్యూటేషన్ పై బదిలీ చేయడం లేదు అని ఆయనతో మొరపెట్టుకోగా ఆయన ఉపాధ్యాయునిపై ప్రేమ వలకబోసి అప్పటికప్పుడే డి.ఇ.ఓ .కు వారి ముందరనే ఫోన్ చేసి డిప్యూటేషన్ పై బదిలీ అయిన ఉపాధ్యాయిని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించడంతో ఆయన దానికి ఒకే అని చెప్పేశాడు అయితే విషయం ఇక్కడ ఉపాధ్యాయులు ఒకరిపై ఒకరు డిప్యూటేషన్ల పై వెళితే ఇక్కడ ఎస్సీ బీసీ పిల్లలకు చదువు చెప్పేవారు. ఎవరు అని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు దీనికి స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు తోడు అయ్యి ఆ ఉపాధ్యాయుని బదిలీ డిప్యూటేషన్ పై వెళ్లిపోవడానికి ప్రయత్నం చేశారు. అయితే ఈ రకంగా డిప్యూటేషన్ లపై ఉపాధ్యాయులను బదిలీ చేస్తే ఇక్కడ చదువు ఎవరు కొనసాగించాలి అనే దానిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణా రావే మళ్లీ ఇంగ్లీష్ ఉపాధ్యాయిని నియమించాలని స్థానిక గ్రామ ప్రజలు కోరుతున్నారు. అయితే ఇదే మంత్రి పాన్ గల్లులో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతే అది కరెక్టే కదా అని ప్రోత్సహించాడు కానీ ఇక్కడ మాత్రం ఉపాధ్యాయిని డిప్యూటేషన్ పై బదిలీ చేసి విద్యార్థులను బలి చేశాడు.


జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాల వీపనగండ్ల

# మోడీ గారి ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది

**బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బెన్నూరు ఆశన్న**

**ఖిల్లా గణపురం, జూన్ 29, ప్రభాతవార్త;** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో ఈ 11 సంవత్సరాల లో దేశం ఎంతో అభివృద్ధిని సాధించిందని జిల్లా ఓబీసీ జిల్లా అధ్యక్షులు బెన్నూరు ఆశన్న అన్నారు. ఆదివారం బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర పిలుపుమేరకు మండల కేంద్రంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సకాలంలో చిన్న కారు నుంచి ఏ రైతుకైనా రైతుబంధు సంవత్సరానికి 6000 ఉజ్వలపథకం ప్రతి కుటుంబానికి ఉజ్వల సిలిండర్ పంపిణీ ప్రతి నిరుపేదకు బ్యాంకుల్లో జీరో అకౌంట్ తెరవడం ప్రతి కుటుంబానికి రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు బిజెపి ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రపంచమంతా కరోనాతో అతలాకుతలమవుతుంటే నరేంద్ర మోడీ దేశీయంగా రెండు రకాల కోవిడ్ఇంజక్షన్లు ఉత్పత్తి చేసి భారతదేశ ప్రజలతోపాటు అనేక దేశాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రపంచం మన దేశం వైపు కన్నెత్తి చూసే విధంగా మోడీ పరిపాలన సాగుతుందని రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను బలపరిచి మోడీకి వెన్నుదన్నుగా నిలవాలని దీంతో దేశం పటిష్టంగా ఉంచడానికి సహకరించిన వారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ అధ్యక్షులు రామచంద్రయ్య, బిజెపి నాయకులు విక్రం రామ్ రెడ్డి సీతారాములు వెంకటేష్ సత్యనారాయణ యువ మోర్చా నాయకులు ముదిరాజ్ గోపి, శివ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

# కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్**

**అమరచింత, జూన్ 29, ప్రభాతవార్త;** కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల సాకార కళ నెరవేరుతుందని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. ఆదివారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన లబ్ధిదారుల ఇంటిదగ్గర ముగ్గు వేసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇండ్లు లేని ప్రతి పేదవానికి ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేశామని ఆయన తెలిపారు. అలాగే గత పాలకులు 10 సంవత్సరాల పాలించిన పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని వాగ్దానం చేసిన ఏ పేదవానికి ఇండ్లు ఇవ్వలేదని ఆయన అన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో పట్టణ, గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పామిరెడ్డి పల్లె కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బండి బీసీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోవిందమ్మ, మన్యపు రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు విష్ణు, మాదారం కృష్ణారెడ్డి, తిరుమలరెడ్డి, తోకలి కృష్ణ, దేవర్ల మహేష్, కురువరాజు, ఎరుకలి హనుమంతు, రాములు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం...

**- సీబీఎం ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ డా.చిక్కుడు అనురాధ**

**కల్వకుర్తి, జూన్ 29 ప్రభాతవార్త:**చారకొండ మండలం శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ దేవాదాయ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న వారి ఇండ్లను ఇటీవల హైకోర్టు ఉత్తర్వుల మేరకు దేవాలయ పరిసరాల్లో అధికారులు ఇండ్లను కూల్చివేశారని, ఇందులో ఎలాంటి పక్షపాతం, రాజకీయాలు లేవని సీబీఎం ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ డా.చిక్కుడు అనురాధ అన్నారు. ఆదివారం ఇండ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను సీబీఎం ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ డా.చిక్కుడు అనురాధ పరామర్శించి ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయ పరిసరాల్లో ఇండ్లను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో ఇండ్ల స్థలాలు అందించి పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని, ఎవరు అధైర్య పడవద్దన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని బాధితులు అధైర్య పడవద్దని, మానసికంగా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం, సీబీఎం ట్రస్టు బాధితులకు ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండె వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నాయకులు సందీప్‌రెడ్డి, బాధిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సీబీఎం ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ డా.చిక్కుడు అనురాధ

# స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేసుకున్న గ్రామస్తులు

**దామరగిద్ద, జూన్ 29 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని ఉల్లిగుండం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు గురించి అనేకసార్లు ధర్నాలు చేసిన ప్రభుత్వాలు, అధికారుల చుట్టూ తిరిగినా రోడ్డు గురించి మాత్రం ఎవరు పట్టించుకోవడం. చేసేదేమీ లేక గ్రామస్తులందరూ కలిసి స్వచ్ఛందంగా గుంతల మయమైన బీటీ రోడ్డుకు మట్టితో మరమ్మత్తులు చేసుకున్నారు. పనులలో గ్రామస్తులు పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరచి ఉల్లిగుండం గ్రామానికి బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డు మరమ్మతులు చేసుకున్న గ్రామస్తులు

## సారిక టౌన్‌షిప్‌లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక

**పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు,మున్సిపల్ కమిషనర్**


పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

**భూత్పూర్,జూన్ 29,ప్రభాతవార్త :**రాష్ట్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ఆదివారం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డు సారిక టౌన్‌షిప్ రాజీవ్ స్వగృహలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు,ఉద్యోగులు,పారిశుద్ధ్య సిబ్బంధితో పాటు కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,కోరె పవన్,శివరాములు తదితరులు పాల్గొన్నారు.వార్డులో ర్యాలీ నిర్వహించి వార్డు సమస్యల్ని అడిగి తెల్సుకున్నారు.

## మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, జూన్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన మాడిశెట్టి బాలు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాలు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని, అతని మృతితో కుటుంబ పోషణ భారంగా మారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు రసూల్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జగన్, అంజిగౌడ్, శ్రీకాంత్ నేత, వినీల్, శ్రీకాంత్, అలీమ్ పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ కార్యక్రమం దేశ ప్రగతి కొరకు యువతకిచ్చే సందేశం


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బిజెపి నాయకులు

**బాలానగర్, జూన్ 29 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని సూరారం, వీరన్నపల్లి గ్రామాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వీరన్నపల్లి గ్రామానికి బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, సూరారం గ్రామానికి రాష్ట్ర నాయకులు జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్ కీ బాత్ వేదిక ద్వారా దేశ ప్రగతికి దోహదపడే అంశాలపై ప్రధాని సందేశం ప్రతి పౌరునికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. గ్రామస్థులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం, స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వారు పలువురు నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆసక్తికరంగా వీక్షించారు.

## ప్రశాంతంగా ముగిసిన సౌరభ దాస సాహిత్య పరీక్షలు

**మహబూబ్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త :** విశ్వ మధ్వ మహా పరిషత్ సంస్థ శ్రీశ్రీశ్రీ 1008 ఉత్తరాధి మఠం స్వాముల వారిచే స్థాపించబడిన సౌరభ దాస సాహిత్య విద్యాలయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని సౌరభ దాస సాహిత్య విద్యాలయ నిర్వాహకులు ప్రమోదాచార్యులు, పాలమూరు దాస సాహిత్య సంచాలకులు శశిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షలు దేశ వ్యాప్తంగా, ఇతర దేశాలతో కలిపి 15 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని వారు తెలిపారు. అందులో భాగంగా పాలమూరు స్థానిక ఉత్తరాధి మఠం, సత్యప్రమోద గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ఈ నెల 28,29 శనివారం, ఆదివారం నిర్వహించామని పాలమూరు దాస సంచాలకులు శశిరేఖ తెలిపారు. అలాగే కొత్తగా ఈ విద్యాలయంలో చేరాలనుకునే అభ్యర్థులు చేరాలని వారు కోరారు. గురువుల అనుగ్రహం, సదస్యుల సహకారంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకులు పండిత ప్రశాంత్ ఆచార్యులు, సౌరభ సభ్యులు పాల్గొన్నారు.


పరీక్షలు రాస్తున్న సౌరభ సభ్యులు

## స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపికి పట్టం కట్టాలి

**మండల అధ్యక్షుడు సంజీవ్ గౌడ్**

**దామరగిద్ద, జూన్ 29 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని క్యాతన్ పల్లి శక్తి కేంద్రంలో బిజెపి వికసిత భారత్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 11 సంవత్సరాల నరేంద్ర మోడీ పాలనపై ప్రజలతో మమేకమై చర్చించి ,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వికాసి భారత్ లక్ష్యంగా నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఇంటింటికి కరపత్రాలు పంపించడం జరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపికి అత్యధిక సీట్లు ఇచ్చి గెలిపించాలని ప్రజలని కోరడం జరిగింది. అదేవిధంగా నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు సంజీవ్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు అబ్దుల్ నబీ, జిల్లా కార్యదర్శి గోపాల్ రావు, శక్తి కేంద్రం ఇంచార్జి మోనేష్, మండల నాయకులు అంజయ్య గౌడ్, బుత్ అధ్యక్షులు కావలి లాలప్ప, చిన్న రాజు గౌడ్, సీనియర్ నాయకులు కుమారి నారాయణ, వెంకటప్ప, బోయిని పార్వతయ్య, గ్రామ ప్రజలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా నిర్వహించిన ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు

**శ్రీరంగాపూర్, జూన్ 29 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే చౌరస్తా లో ఎస్సీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ ముని మనవడు అయిన చత్రపతి సాహు మహారాజు 151 వ జయంతి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ జన్మదిన వేడుకలో మండల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో ఎస్సీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్, ఎస్సీ ఫెడరేషన్ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ జె. ఆశన్న, శ్రీరంగాపూర్ మండల ఎస్సీ ఫెడరేషన్ కన్వీనర్ జె. లక్ష్మణ్,పెబ్బేరు మండల బీసీ ఫెడరేషన్ కన్వీనర్ శివకుమార్ నాయుడు, శ్రీరంగాపూర్ మండల యూత్ కన్వీనర్ బి.సంపత్ కుమార్, పట్టణ కోశాధికారి జె.రాముడు, పట్టణ యూత్ కన్వీనర్ వంశి దేవ్, బీసీ నాయకులు గణపతి, గంగయ్య, చింతలయ్య, శ్రీను, శేఖర్, బాలస్వామి, గట్టయ్య, ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు జె .రామస్వామి, జె.అర్జున్, అంబేద్కర్ కాలనీవాసులు బి. మునీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకల దృశ్యం

## పేటలో ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బిజెపి శ్రేణులు

**నారాయణపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త :** ప్రతినెల చివరి ఆదివారం జరిగే ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం నారాయణపేట పట్టణంలోని బిజెపి శ్రేణులు టీవీ ముందు కూర్చుని వీక్షించనున్నారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి శ్రేణులు మాట్లాడుతూ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని 2014లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారన్నారు. ఆ నెలలో జరిగిన అంశాలు, వివిధ రంగాల్లో భారతీయులు సాధించిన విజయాలను ప్రధాని మోదీ ప్రజలతో పంచుకుంటారన్నారు. ఇంగ్లీష్ సహా 11 అంతర్జాతీయ భాషల్లోనూ ప్రసారం అవుతుందన్నారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా, పట్టణ శ్రేణులతో బాటు తదితరులు ఉన్నారు.


మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న బిజెపి నాయకులు

## బీసీ బాలుర కళాశాలను సందర్శించిన బీసీ జాగృతి సేన

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని శాతవాహన కాలనీలోగల బీసీ బాలుర కళాశాలను సందర్శించి విద్యార్థులను కలిసి సమస్యలను బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వెంకటేష్ యాదవ్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదని, హాస్టల్ కు ప్రభుత్వం సంత భవనాన్ని నిర్మించాలని కోరారు. కనీస మౌలిక వసతులైన, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడం, మంచినీటి ట్యాంకును సకాలంలో శుభ్రం చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, బీసీలు అంటే ప్రభుత్వానికి చిన్న చూపు అని ప్రశ్నించారు, సత్వరమే హాస్టల్లోని సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీపక్, రమేష్, వెంకటేష్, ఆనంద్, కిరణ్, రవి, శివ, శ్రీకాంత్, గణేష్, ప్రశాంత్, ధనుష్, రాకేష్, శ్రీకాంత్ అనిల్, భీమేష్, నవీన్, ప్రవీణ్, శ్రీకాంత్, అశోక్, వేణు, భాను తదితరులు పాల్గొన్నారు.


కళాశాలను సందర్శించిన బిసి జాగృతి సేన సభ్యులు

## మీడియాపై దాడిని ఖండిస్తున్నాం

**ఇటిక్యాల, జూన్ 29 ప్రభాతవార్త :** హైదరాబాదులో మీడియా కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాస్వామ్యంలో మీడియాకు పత్రికలకు ప్రశ్నించే హక్కు ఉంటుందని మీడియా కార్యాలయంపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుటాన్ దొడ్డి మంద జగన్నాథం డిమాండ్ చేశారు.

## ప్రమాద భీమా రూ.10 లక్షలు మంజూరు

**బిజినేపల్లి,జూన్ 29 ప్రభాతవార్త:** మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘ సభ్యులకు లోన్ భీమా, ప్రమాద భీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని స్త్రీనిధి మేనేజర్ విక్రమ్ కుమార్ తెలిపారు. సహజంగా మరణించిన సంఘ సభ్యురాలికి చెందిన బ్యాంకు రుణ బకాయి నిల్వను గరిష్టంగా రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తున్నదని, ప్రమాద వశాత్తు మరణించిన సంఘ సభ్యురాలి కుటుంబానికి రూ. 10 లక్షలు భీమా అందిస్తున్నదని వివరించారు. గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, స్త్రీనిధి ద్వారా ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు పరుస్తున్నదని ఆయన పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వట్టెం గ్రామానికి చెందిన చిట్టెమ్మ అనే మహిళా సంఘ సభ్యురాలి కుటుంబానికి ప్రభుత్వం నుండి ప్రమాద భీమా రూ.10 లక్షలు మంజూరు అయినట్టు స్త్రీనిధి మేనేజర్ విక్రమ్ కుమార్ పేర్కొన్నారు.

## నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

**బాలానగర్, జూన్ 29 ప్రభాతవార్త :** బాలానగర్ గ్రామ పంచాయతీలో గ్రామస్తులంతా కలిసి ఆదివారం బాలానగర్ గ్రామ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మధు, గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడుగా దినేష్, ప్రధాన కార్యదర్శులుగా కరాటే రవి, శ్రీనులను ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తూ, గ్రామ అభివృద్ధికై పాటు పడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# కళాకారులే ఉద్యమానికి ఊపిరి

- తెలంగాణ కొందరి చేతుల్లో బందీ..
- పార్టీలకతీతకంగా ధూం ధాం నిర్వహించాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** కళాకారులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్ లో తెలంగాణ కళాకారులు ఆధ్వర్యంలో నిర్వహించిన "పాటల పల్లకిలో 12 గంటలు పాలమూరులో " కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కొందరి చేతిలోనే బంధీ అయిందని ఆయన అన్నారు. బతుకమ్మ అంటే ఆ ఇంటి ఆడపడుచు అయిందని, ఉద్యమకారులు అంటే కొడుకు, అల్లుడు అయ్యారని ఆయన ఆరోపించారు. మీ పాట లేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. కవులు, కళాకారులు, గాయకులు, వారి పాట, ఆటల తోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది అని తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర విలువ కట్టలేనిదని ఆయన చెప్పారు. గూడ అంజన్న, జయరాజ్, గోరేటి వెంకన్న, అందెశ్రీ లు కలం కు మీ గళం తోడై తెలంగాణ ఉద్యమాన్ని ప్రతి పల్లెకు, ప్రతి గూడెంకు , ప్రతి వాడకు ప్రతి ఊరికి తీసుకువెళ్ళారని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరిని ఉద్యమ ఆవశ్యకతను గురించి ఆలోచించే విధంగా మీ ఆట , పాట చేశాయని అనటలో అతిశయోక్తి లేదు అని ఆయన చెప్పారు. ఊరు వాడా అనే తేడా లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళడం లో కళాకారులు అందరూ సఫలీకృతం అయ్యారని ఆయన చెప్పారు. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గత పది సంవత్సరాలుగా పాట మీద, కళల మీద గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధం విధించిందని ఆయన ఆరోపించారు. మీ ఆట, పాట, తెలంగాణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం అని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం కళాకారుల పైన సానుకూల దృక్పథంతో ఉందని ఆయన అన్నారు. కేసిఆర్ ను అధికారంలో నుండి దించడంలో , ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో కళాకారుల కృషి అభినందనీయం అని ఆయన అన్నారు. నిజాయితికి నిలువెత్తు నిదర్శనం కళాకారులని ఆయన చెప్పారు. మళ్ళీ ఒక్కసారి కేసిఆర్ అధికారంలోకి వస్తే నరమాంసం రుచి తెలిసిన రాబందుల్లా మీద పడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారిని ఏకం చేసి హైదరాబాద్ లో ధూం ధాం నిర్వహించాలని, మీ సమస్యలు పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అంజయ్య గౌడ్, ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్, టిపిసిసి సాంస్కృతిక సేన అధ్యక్షులు చక్రాల రఘు , జిల్లా కళాకారులు టంకర శ్రీనివాస్, ఎదిర నరసింహులు, ఎదిర బాలస్వామి , రాష్ట్ర మహిళా కళాకారులు అంతడుపుల రమాదేవి, దప్పు స్వామి, మురళి, జక్కగోపాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## భారతదేశం నేడు విపత్కర పరిస్థితి ఎదుర్కొంటుంది

**వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణు**

**నారాయణపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ గౌరవిస్తూ పాలన చేయాల్సిన బిజెపి పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాల రాస్తున్నారని పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ సంయుక్తంగా ఆరోపించారు. ఆదివారం అశోక్ నగర్ కాలనీ నందు గల మ్యాదర్ మల్లమ్మ దేవాలయం నందు బస్తీ వాసులతో సమావేశమై వార్డ్ 8 కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి సందర్భంగా బండి వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ ప్రజలకు సమాన హక్కులు సమన్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న నేటి బిజెపి పాలకుల తీరు తీవ్రంగా ఆక్షేపణీయంగా ఉందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను కాలరాస్తూ, కట్టు బొట్టు, తిండి, పూజ అన్నింటిపైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులను భంగం కలిగిస్తున్నారు. ఇలాంటి తరుణంలో దేశ స్వతంత్రం కోసం ప్రాణ త్యాగులైన మహాత్మా గాంధీ, రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన డా. అంబేద్కర్ సాహెబ్ ఆలోచనలో కాపాడుకునేందుకే ఏఐసీసీ అధ్యక్షులు కర్గే, రాహుల్ గాంధీ పిలుపు అందుకని జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదాలతో వారి చిత్రపటాలను భారత రాజ్యాంగ పుస్తకాన్ని చేత పట్టి కరపత్రాలను ఇంటింటికి గడప గడపకు అందిస్తూ ఉద్యమిద్దామని పిలుపునిస్తూ అశోక్ నగర్ బస్తీ వీధులలో ర్యాలీగా వెళుతూ బస్తివాసులను చైతన్య పరుస్తూ తిరగడం జరిగింది. కార్యక్రమంలో బోయ ఎంకటి, కురువ మనోజ్ నాయకత్వంలో వార్డ్ కాంగ్రెస్ కమిటీ ఈ క్రింది విధంగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 8 వార్డ్ అధ్యక్షునిగా సిద్ధం లక్ష్మణ్ ఉపాధ్యక్షులుగా సమీర్ షేక్,భీమేష్ సారంగి ప్రధాన కార్యదర్శిగా అవుటి వీరేష్, కార్యదర్శిగా గొల్ల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా బోయ వెంకటప్ప, కురువ మనోజ్, మారుతి నిజాం బాయ్, వడ్ల లక్ష్మణ్‌చారి, జహంగీర్, చాకలి రాజు. సోషల్ మీడియా ఇన్చార్జిగా రోహన్ షేక్, వార్డ్ మహిళా అధ్యక్షురాలుగా కుంటిమారి సుజాత, ఉపాధ్యక్షురాలుగా ఔటిసిద్దమ్మ, కురువ కందెన్‌పల్లి సత్యమ్మ, ప్రధాన కార్యదర్శిగా ప్రమీల కార్యదర్శిగా నసీం భాను, కార్యవర్గ సభ్యులుగా సిద్ధం కిష్టమ్మ, మంగమ్మ, మహ్మద్ రజియా, బేగం శాంతాబాయి, సోషల్ మీడియా ఇన్చార్జిగా లక్ష్మిలను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న నాయకులు

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన జిల్లెల చిన్నారెడ్డి

**శ్రీరంగాపూర్, జూన్ 29 ప్రభాతవార్త :** ఆదివారం శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన బి.కురుమ్మూర్తి 19000, సి మొగులమ్మ 29,000 సి. హైమావతి 18000, టి.బాలకృష్ణ 5000, ఎండి గౌసియా బేగం 5000, రంగస్వామి 22,000, పి.రూప 10000, జి.రంగారెడ్డి 24000, పి. కీర్తన 18000 రూపాయల చెక్కులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులైన డా. జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, శ్రీరంగాపూర్ మండలం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి అందుబాటులోను, అండగా ఉంటుందని, ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ పట్టణ అధ్యక్షులు కుమ్మరి గోవిందు, శ్రీరంగాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు పసుల రాముడు, గ్రామ ఉపాధ్యక్షుడు రామరాజు, షేర్ పల్లి వెంకటేష్ సాగర్, మండల ఉపాధ్యక్షుడు జానంపేట ఇమ్రాన్, బహుజన రమేష్, శాంతయ్య, ల్యాబ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న చిన్నారెడ్డి

## టీచర్‌ను సస్పెండ్ చేయడం అన్యాయం

**నారాయణపేట ప్రతినిధి,జూన్29 ప్రభాతవార్త :** మతోన్మాద మూకల అరాచకానికి తలొగ్గి విద్యార్థులకు శాస్త్రీయ విద్యను బోధించిన యాలాల మండలం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ బయోసైన్స్ టీచర్ కాశీంబిని విధులనుండి సస్పెండ్ చేయడం అన్యాయమని, డిఈఓపై చర్య తీసుకోవాలని ఆవాజ్ జిల్లా నాయకులు మౌలాలి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా జడ్పీహెచ్ఎస్ యాలాల గర్ల్స్ హైస్కూల్ లో పనిచేస్తున్న కాశీంబీ బయోసైన్స్ పాఠ్యాంశ బోధనలో భాగంగా ప్రత్యక్షంగా పిల్లలకు అవగాహన కల్పించడం కోసం చనిపోయిన జంతువు మె దడును ప్రదర్శిస్తూ పాఠం బోధించారు. పిల్లలకు అవగాహన కల్పించడం కోసం అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని అభినందించాల్సింది పోయి మతోన్మాద మూకల దుష్ప్రచారానికి తలొగ్గి ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేయించడం దుర్మార్గం. పాఠ్యాంశ బోధనతోగాని, పాఠశాలతోగాని ఎలాంటి సంబంధం లేని మతోన్మాద మూకలు వచ్చి ఆందోళన చేసి, పాఠశాల వాతావరణం చెడగొడుతుంటే వారిపై చర్యలు తీసుకోవాల్సిన డీఈఓ ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం శోచనీయం. ఇలాంటిచర్యలు మతోన్మాద మూకలకు మరింత బలం చేకూరుస్తాయి. శాస్త్రీయ పద్ధతిలో అంకిత భావంతో ప్రయోగాత్మక పద్ధతిలో బోధించే టీచర్లను మానసిక క్షోభకు గురిచేసి, సృజనాత్మక బోధన చేయకుండా చేస్తాయి. గతంలో నిజామాబాద్‌లో, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో మతోన్మాదులు అదేరకమైన దాడికి పాల్పడ్డారు.అదేవరుసలో యాలాల ఉపాధ్యాయురాలిని టార్గెట్ చేశారు. శాస్త్రీయ భావజాలంతో పనిచేసే టీచర్లపై దాడులుచేస్తున్న వీరిలక్ష్యం. విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం అందకుండాచేసి,మూఢవిశ్వాసాలను పెంచి పోషించడమే. మతోన్మాదు ల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. టీచర్ కాశీంబీపై విధించిన అక్రమ సస్పెన్షన్ రద్దు చేసి, మొత్తం ఘటనపై సమగ్ర విచారణ జరిపి అబద్ధాలు ప్రచారం చేసి పాఠశాలపైకి మతోన్మాద మూకలను ఎగదోసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా నాయకులు హస్సన్, మొహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా నాయకులు మౌలాలి

## పేద ప్రజల కష్టాలను తీర్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ

**బిజినేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తు ఎమ్మెల్యే కుచుకుల్ల రాజేష్ రెడ్డి ముందుకు సాగుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.తిరుపతయ్య అన్నారు. ఎమ్మెల్సీ కుచుకుల్ల దామోదర్ రెడ్డి ఆదేశాల మేరకు లట్టుపల్లి, లింగసానిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. లట్టుపల్లి గ్రామ అధ్యక్షుడిగా కమతం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గంట సత్యనారాయణ,గడ్డం లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా వెంకటస్వామి,ప్రేమ్ నాయక్, కోశాధికారిగా శేఖర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. లింగసానిపల్లి గ్రామ అధ్యక్షుడిగా గార్లపాటి నరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, నరసింహ ప్రధాన కార్యదర్శిగా కోరుపాల మొగులాలు, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారి జంపుల దశరథం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందడి నరేందర్ రెడ్డి, గడ్డి గోపుల చేతన్ అదే గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


లింగసానిపల్లిలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ

## చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జిగా పేట ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జిగా ఆదివారం నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి నియమితులయ్యారు. నియమితులైన సందర్భంగా డా. చిట్టెం పర్ణిక రెడ్డికి నియోజకవర్గ ప్రజలు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే పర్నికారెడ్డి

**నారాయణపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సలీం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గం.లకు పట్టణలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్లు, వార్డుల్లోని సమస్యల గురించి నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గం.లకు నారాయణపేట పట్టణంలో సరాఫ్ బజార్‌లోని శ్రీ బాలాజీ స్వామి ఆలయం నుంచి శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం వరకు జరిగే శ్రీ పూరి జగన్నాథ స్వామి రథయాత్రను ప్రారంభించి పాల్గొంటారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## ఉచిత ఉపకరణాల దరఖాస్తు గడువు జులై 5 వరకు పెంపు

**గద్వాల టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:** దివ్యాంగులకు ఉచితంగా అందించే ఉపకరణాల కోసం దరఖాస్తు దాఖలు చేసుకునేందుకు గడువు తేదీ జులై 5 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారిని సునంద ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ద్విచక్రవాహనాలు, వ్యాపార వాహనాలు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్, వీల్‌చైర్లు తదితర ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జులై 5 వరకు దరఖాస్తు గడువు పెంచామని, అర్హులైనవారు టీజీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు.

## పిఆర్‌టియు ఆధ్వర్యంలో అనాథ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ వితరణ

**ఊట్కూర్, జూన్ 29 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలలో కీ॥శే॥ మొట్కర్ లక్ష్మారెడ్డి (టీచర్) ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పలు పాఠశాలల అనాథ విద్యార్థులకు 250 స్కూల్ బ్యాగుల పంపిణీ చేస్తామని 1988 పదవ తరగతి బ్యాచ్ మిత్రుల బృందం ఆధ్వర్యంలో వితరణ జరుగుతుందని ఊట్కూరు మండల పిఆర్‌టియు అధ్యక్షులు కోరం గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి నరసింహారెడ్డి సంఘ నాయకులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** అనారోగ్య బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని దుబ్బతండాకు చెందిన వద్యవత్ మోనికకు మంజూరైన రూ.26వేల చెక్కును ఆదివారం హైదరాబాదులోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుల తరపున దుబ్బతండ శ్రీనుకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

## మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలి

**నారాయణపేట, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాకు చెందిన మున్నూరు కాపు సభ్యులు హైదరాబాదులో జరిగిన రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఎన్నికలో పాల్గొని రాష్ట్ర జనరల్ సెక్రటరీగా 182 ఓట్లతో గెలుపొందిన పెద్ది పెంటయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాబోయే రోజుల్లో మున్నూరు కాపుల అన్ని రంగాలలో అభివృద్ధి చెందేల కృషి చేయాలని నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బండి శివరాం రెడ్డి, జొన్నలు సుభాష్, బసిరెడ్డి, బెల్లం శ్రీనివాస్ కేశవులు, వెంకట్ రెడ్డి,జగన్నాథ్ రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, తెలియజేశారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజ్, రవిజేంద్ర, మాజీ మంత్రి జోగి రమణను మున్నూరు కాపు సంఘం సభ్యులు కలిశారు.

## ఖాజీపూర్‌లో మంచినీటికి కటకట ఇబ్బందుల్లో గ్రామస్తులు

**మద్దూర్, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి మంచినీళ్లు రావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీళ్ల కోసం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని గ్రామస్తులు అంటున్నారు. అధికారుల పాలన వలన ఏ అధికారికి చెప్పుకోవాలి ఎక్కడ చెప్పుకోవాలో అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. కనీసం మిషన్ భగీరథ నీళ్ళు కూడా రావడం లేదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే తన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహయం అందజేస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

**వెల్దండ, జూన్ 29 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన చెర్క కిష్టమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతురాలి కుటుంబానికి గంగపుత్ర యువసేన సభ్యులు విరాళాలు సేకరించి రూ.10వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. మృతురాలి కుటుంబానికి గంగపుత్ర ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సందీప్, రమేష్, బిక్షపతి, కృష్ణయ్య, రమేష్, భాస్కర్, చైతన్య, బాలకృష్ణ, శశికాంత్, బాలకృష్ణ, చంద్రమోళితో పాటు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో సేవాదళ్‌కు ప్రత్యేకస్థానం



జెండాను ఎగురవేస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

**మహబూబ్‌నగర్, జూన్29, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేక స్థానం ఉందని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. చివరి ఆదివారం సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని 29వ వార్డు కుమ్మరివాడిలో సేవాదళ్ అసెంబ్లీ అధ్యక్షులు జగదీశ్వర్ ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో ముడాచైర్మన్ ముఖ్యఅతిథిగాహాజరై జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ విభాగం ముందుండి పనిచేస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సేవాదలకు ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. జిల్లాలో సేవాదళ్ ను మరింతగా బలోపేతం చేయాలని కోరారు. ప్రతి నెల చివరి ఆదివారం సేవాదళ్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్ పాష, దేవరకద్ర అసెంబ్లీ ఇన్చార్జీ వేణుకుమార్, నాయకులు సుబాష్ ఖత్రి. దేవన్న, శ్రీను. లోక్ నాథ్, ఉమర్, అలీ, అల్తాఫ్, షబ్బీర్ అలీ, విజయలక్ష్మి, ప్రమీల, లింగమ్మ, శ్రీశైలం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అనుబంధశాఖల ఇన్చార్జిగా సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్, జూన్29, ప్రభాతవార్త:** జిల్లాకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ.సంజీవ్ ముదిరాజ్ పార్టీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనుబంధశాఖల ఇన్చార్జీగా నియమితులయ్యారు. ఇదే విభాగాలకు టీపీసీసీ ఉపాధ్యక్ష హోదాలో ఇన్చార్జీగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ సి. వంశీకృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

## మాజీ చైర్మన్ సుడిగాలి పర్యటన

**- కాలనీల్లో సమస్యలు తెలుసుకున్న ఆనంద్‌గౌడ్**



కాలనీల్లో పర్యటిస్తున్న ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్, జూన్ 29, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని కాటమయ్య స్వామి దేవాలయ నిర్మాణం పనుల పరిశీలన అనంతరం గౌడ సంఘం పెద్దలతో నిర్మాణ పనుల్లో ఒడిదుడుకులను అడిగి తెలుసుకున్నారు. దేవాలయం దగ్గర రాజకీయం చేయకుండా, మనమంత కలికట్టుగా సమాజ ఉద్దరణకై కలిసికట్టుగా ఇప్పుడు ఒక అడుగు ముందుకువేశామని, ఈ అడుగు మరింత పటిష్టంగా ఉండేలా ఆలయ అభివృద్ధికి సహకరిస్తూ ముందుకు సాగుదామని కోరారు. కార్యక్రమంలోగ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, వెంకటస్వామి గౌడ్ సాయిలు గౌడ్, శ్రీధర్ గౌడ్, రాజయ్య గౌడ్, పురుషోత్తం గౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేష్, చక్రవర్తిగౌడ్, శేఖర్ గౌడ్, నరేందర్ గౌడ్, వినోద్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా పంచముఖి కాలనీలో వేసిన నూతన సీసీ రోడ్ల పరిశీలించారు. మురుగునీటి కాలువల వ్యవస్థను పరిశీలించి అనంతరం కాలనీవాసులతో ముచ్చటించారు. రాబోయే కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను చేసుకుంటూ అన్నివేళలా మీ వెంటే ఉంటామని హామీ ఇచ్చారు.

## ఉచిత ఉపకరణాల దరఖాస్తు గడువు జులై 5 వరకు పెంపు

**నారాయణపేట, జూన్ 29 ప్రభాతవార్త :** నారాయణ పేటలో దివ్యాంగులకు ఉచితంగా అందించే ఉపకరణాల కోసం దరఖాస్తు దాఖలు చేసుకునేందుకు గడువు జులై 5 వరకు పొడిగించినట్లు వికలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ గౌడ్ తెలిపారు. దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, వ్యాపార వాహనాలు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్, వీల్‌ఛైర్లు తదితర ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జులై 5 వరకు దరఖాస్తు గడువు పెంచారని అర్హులైనవారు టీజీఓ బీఎంఎంఎస్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

## ఆటో డ్రైవర్స్ ధర్నాను విజయవంతం చేద్దాం

**మద్దూర్, జూన్29 ప్రభాతవార్త:** ఆటోడ్రైవర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, మండల తహసిల్దార్ కార్యాలయం ముందు మంగళవారం జరిగే ఆటో డ్రైవర్స్ ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లాకార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లాకార్యదర్శి అంజిలయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం రోజు మండలకేంద్రంలో ఆటోడ్రైవర్ అడ్డాలలో కరపత్రంతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇస్తామన్న హామీ అమలుచేయాలన్నారు. ఆటోడ్రైవర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, 55సంవత్సరాలకు పెన్షన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక కొత్త బస్టాండ్ నుండి మండల తహసిల్దార్ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ ఉంటుందని ఆటో డ్రైవర్స్ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు సత్యనారాయణ, ముకుందరెడ్డి, సురేష్, గోవింద్, సాయిరెడ్డి, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కమర్షియల్ వాహనాలకు వైట్ ప్లేట్ బోర్డులు

**జిల్లా కేంద్రంలో విచ్చల విడిగా రవాణా సంచారం.. ఆర్‌టిఏ నిబంధనలు దుర్వినియోగం ..**



వాహనాలకు వైట్ బోర్డు పెట్టిన దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 29 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో రవాణా శాఖ నిబంధనలు దుర్వినియోగం కలిగిస్తూ వాణిజ్య ప్రయోజనాల కోసం వైట్ బోర్డ్ వాహనాలను ఉపయోగిస్తున్నప్పుడు పెరుగుతున్న ధోరణిని రవాణా శాఖ అధికారులు గుర్తించక పోవడం విడ్డూరం , దీని వలన ప్రభుత్వానికి మరియు చట్టబద్ధమైన వాణిజ్య వాహన యజమానులకు గణనీయమైన ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయి. తెల్ల బోర్డు రిజిస్ట్రేషన్ ప్లేట్ వాహనాలను వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో చూస్తూ చూడనట్లు అధికారులు వదిలేస్తున్నారు, పసుపు నంబర్ ప్లేట్ వాహనాలను అద్దెకు లేదా అద్దెకు తీసుకునే వాహనాలు వంటి వాణిజ్య కార్యకలాపాల కోసం నియమించాలని, తెల్ల బోర్డు వాహనాలు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమేనని ఉపయోగించాలని నిబంధనలు ఉన్నప్పటికీ కూడా ఆర్ టి ఓ అధికారుల నిబంధనలు తుంగలో తొక్కి ప్రతి రోజూ జిల్లా కేంద్రంలో పదుల కొద్ది వాహనాలు కర్ణాటక నుండి జీప్, తూఫాన్ , ట్రాక్టర్, టిప్పర్ ల రూపం అడ్డగోలుగా సంచరిస్తున్నాయి. అనేక రకమైన వాణిజ్య వాహనాలు వైట్ బోర్డ్ వాహనాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించినప్పుడు, అది ప్రభుత్వానికి చట్టబద్ధమైన వాణిజ్య వాహన యజమానులకు గణనీయమైన ఆర్థిక నష్టాలకు దారి తీస్తుంది. సాంప్రదాయకంగా, పసుపు నంబర్ ప్లేట్ వాహనాలను అద్దెకు లేదా అద్దెకు తీసుకునే వాహనాలు వంటి వాణిజ్య కార్యకలాపాల కోసం ఉపయోగించాలి. అయితే వైట్ బోర్డ్ వాహనాలు వ్యక్తిగత ఉపయోగం కోసం ఉపయోగిస్తున్నారు. అయితే, వాణిజ్య ప్రయోజనాల కోసం వైట్ బోర్డ్ వాహనాలను ఉపయోగిస్తున్నప్పుడు పెరుగుతున్న ధోరణిని అధికారులు గుర్తించక పోవడం గమనార్హం , కొన్ని సందర్భాల్లో వాహనదారులు పసుపు నంబర్ ప్లేట్ చట్టబద్ధంగా అవసరమయ్యే కార్యకలాపాల కోసం తెల్ల బోర్డు వాహనాలను ఉపయోగిస్తున్నారు, జిల్లాలో ప్రభుత్వ అధికారులు అద్దెలకు పసుపు బోర్డు ఉన్న వాణిజ్య వాహనాలు కాకుండా వైట్ ప్లేట్ వాహనాలు వాడుతున్నట్లు తెలుస్తుంది. వ్యక్తిగత వాహనాలతో పోలిస్తే వాణిజ్య వాహనాలకు సంబంధించిన టాక్స్, రుసుములు ఎక్కువగా ఉండటం వలన ఈ చట్టవిరుద్ధమైన పద్ధతి ప్రభుత్వానికి ఆదాయాన్ని గండి కోరుతున్నారు. కొందరు అధిక రుసుములు చెల్లించే పసుపు బోర్డు వాహనాల యజమానులు తెల్ల బోర్డు వాహనాలను చట్టవిరుద్ధంగా ఉపయోగించే వారి నుండి అన్యాయమైన పోటీని ఎదురుకుంటున్నాము అని పసుపు బోర్డు వాహన యజమానులు అంటున్నారు. ఇటీవలి కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువైంది, ముఖ్యంగా ఈ కార్యకలాపాలను సులభతరం చేసే అనధికారిక యాప్‌ల వాడకంతో కొంతమంది వాహన యజమానులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా తమ సేవలను ప్రచారం చేస్తున్నారు. వాణిజ్య ప్రయోజనాల కోసం వైట్‌బోర్డ్ వాహనాల దుర్వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించి, రవాణా శాఖ అటువంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి సన్నాహాలు చేయాలని ప్రజలను నుండి డిమాండ్ పెరుగుతుంది. వాణిజ్య కార్యకలాపాల కోసం వైట్‌బోర్డ్ వాహనాలను దుర్వినియోగం చేసే వ్యక్తులను గుర్తించి జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు చట్ట విరుద్ధ చర్యలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే తీవ్రతను బట్టి డ్రైవింగ్ లైసెన్స్‌లను కూడా సస్పెండ్ చేయాలని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, నిబంధనలను పాటించడానికి మరియు వాణిజ్యపరంగా నిర్వహించడానికి అధిక రుసుములు చెల్లించే పసుపు బోర్డు వాహన యజమానుల ప్రయోజనాలను కాపాడటం రవాణా శాఖ అధికారుల లక్ష్యంగా పెట్టుకోవాలి. చట్టవిరుద్ధమైన వాణిజ్య కార్యకలాపాలలో పాల్గొనే తెల్ల బోర్డు వాహన యజమానులపై చర్యలు తీసుకోవడం ద్వారా, అన్ని వాణిజ్య వాహన నిర్వాహకులు తగిన మార్గదర్శకాలను పాటించే విధంగా శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాపని వైట్ ప్లేట్ వాహన్నా యజమానులు కోరుతున్నారు.

## త్వరలో అందుబాటులోకి ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనాలు

**జూలై నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తాం**



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ శాఖ పిడి కాశీనాథ్

**ఇటిక్యాల, జూన్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఇండ్లు లేని నిరుపేదలకు రూ. 5 లక్షలను వెచ్చించి నిర్మించేందుకుగాను ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుండగా లబ్ధిదారులు వారి ఇండ్లను నిర్మించుకునేందుకుగాను మునిసిపాలిటీలు, మండల కేంద్రాలలో ప్రభుత్వ పరంగా ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనాలను ప్రభుత్వ స్థలాలలో నిర్మిస్తుండగా ఈనెల జూలై ఆఖరు నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తామని జిల్లా హౌసింగ్ శాఖ పిడి కాశీనాథ్ తెలిపారు. జిల్లాలో 13 చోట్ల ఇప్పటికే గుత్తేదారులు 5 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో ఇందిరమ్మ ఇళ్ల నమూనా భవనాలను నిర్మాణ పనులు చేపడుతుండగా ఇప్పటికే జిల్లాలో ఇటిక్యాల.వడ్డేపల్లి. మానవపాడు. ధరూరు. గద్వాల కేంద్రాలలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనాల కోసం పైకప్పు పనులు పూర్తయ్యాయని కేటి దొడ్డి, గట్టు, రాజోలి మండల కేంద్రాల్లో రూఫ్ లెవెల్ వరకు పనులు కొనసాగాయని అలాగే ఐజలో బేస్మెంట్ మట్టం పనులు పూర్తి అయినట్లు అల్లంపూరు, మల్దకల్ మండల కేంద్రాలలో బేస్మెంట్ మట్టం కొరకు పనులు కొనసాగుతున్నాయని ఉండవల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నమూనా భవనం కోసం స్థలం కొరత ఉందన్నారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ జిల్లాలో 13 చోట్ల ప్రభుత్వ పరంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు గాను రూ.5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ ఇంటి నమూనా భవనాల నిర్మాణ పనులను సగానికి పైగా జూలై ఆఖరు నాటికి పూర్తి చేస్తామని ఆ విధంగా గుత్తే దారులకు ఆదేశాలు ఇస్తున్నామని వారికి విడతల వారీగా బిల్లులు కూడా చెల్లిస్తున్నామని నమూనా భవనాల నిర్మాణ పనులను తాను డిఈఏఈలు పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా హౌసింగ్ శాఖ పిడి కాశీనాథ్ వివరించారు.

## అర్ధరాత్రి పోలీస్ విధులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




అర్థరాత్రి పోలీసు విధులను పరిశీలిస్తున్న ఎస్పీ

**గద్వాలటౌన్, జూన్29, ప్రభాతవార్త:** రాత్రి వేళల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వహించే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, బీట్ డ్యూటీ లను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు శనివారం అర్ధ రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా గద్వాల్ పట్టణం లోని వై ఎస్ ఆర్ చౌక్, న్యూబస్ స్టాండ్, కృష్ణ వేణిచౌక్ ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేసి పెట్రోలింగ్, బీట్, బ్లూ కోల్ట్స్ డ్యూటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా విధులలో ఉన్న అధికారులతో, సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ అర్ధ రాత్రి రోడ్లమీదకు వారిని తనిఖీలు చెయ్యాలని, అనుమానాస్పద వ్యక్తులను ఫ్రింగర్ ప్రింట్ ద్వారా పాపీలన్ డివైస్ లో చెక్ చెయ్యాలని అన్నారు. ప్రతి వాహనదారుడిని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చెయ్యాలని, వాహనాలను తనిఖీ చెయ్యాలని ఆదేశించారు. లాడ్జీలలో తనిఖీలు చేపట్టి కొత్తగా ఉండే వారి వివరాలు పరిశీలించాలని , బీట్ సిబ్బంది కాలనీలలో విస్తృతంగా తిరగాలని, ప్రాపర్టీ నేరాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డి. ఎస్పీ మొగిలయ్య, సి ఐ టంగుటూరి శ్రీను, ట్రాఫిక్ ఎస్సై బాలచందర్ వున్నారు.

### భాగ్యనగరం దిశగా

## దేవరకద్ర మున్సిపాలిటీ

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చేయాలని కోరడంతో, ముఖ్య మంత్రి వెంటనే స్పందించి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి జ్యుడీషి యల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు చేశారు. అదేవిధంగా దేవరకద్రలో వంద పడకల ఆసుపత్రి, జాతీయ భారతమాత రహదారి, వీటితోపాటు డిఫెన్స్ కారిడార్ 400ఎకరాలలో బ్రహ్మోస్ తయారీ యూ నిట్.అనితర సాధ్యుడు జిఎంఆర్ కృషితో దేవరకద్రకు డిఫెన్స్ కారిడార్ ప్రాజెక్టును దేవరకద్రలో ఏర్పాటుచేయడానికి ఎంతో శ్రమించారు. సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని ముందే గుర్తించిన జిఎంఆర్ దేవరకద్రను ప్రపంచ పటంలోకి ఎక్కించారు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి. గెలిచిన 18 నెలల్లోనే కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూ రు చేసిన అనితర సాధ్యుడు దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు, నాయకులు, యువ కులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పుష్పలత

**జడ్చర్ల, జూన్29, ప్రభాతవార్త:** జడ్చర్ల పురపాలిక పరిధిలోని 3వ వార్డు సత్యనారాయణ స్వామికాలనీలో మున్సిపాలిటీ జనరల్ ఫండ్ రూ.3లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం పురపాలక చైర్‌పర్సన్ కోనేటిపుష్పలత భూమిపూజ చేసి పనుల ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సతీష్, కాలనీ అధ్యక్షులు ప్రభాకర్, నాయకులు కోనేటి నరసింహులు, రాజేష్, నరసింహ, రమేష్, కృష్ణనాయక్, దిగంబరరావు, నార్యానా యక్, శ్రీనివాసులు, సుభాష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి**

**గండీడ్ జూన్ 29, ప్రభాతవార్త :** ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని గండీడ్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగేరి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. ఆదివారంగండీడ్ మండలం కొమిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందనీ, విడతలవారీగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరే విధంగా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని వారు సూచించారు. గ్రామాల్లో నాయకుల్లో, కార్యకర్తల్లో వ్యక్తిగత విభేదాలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కకు పెట్టి పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, రాములు, బాలకిష్టయ్య, చెన్నారెడ్డి, వెంకన్న గౌడ్, భగవంతు రెడ్డి, రాజు, వెంకటేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల నుంచి రాని వేతనాలు

**కుటుంబ పోషణ భారంగా మారిందన్న కార్మికులు**







పని చేస్తున్న కార్మికులు

**ధన్వాడ, జూన్ 29 ప్రభాతవార్త :** గ్రామాలకు పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని, చేసిన పనికి వేతనాలు నెలనెలా రాకపో వటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు వాపో తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు ఇతర పనులకు వెళ్ళలేని పరిస్థితి ఉండడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ప్రభుత్వాలు పంచాయతీలకు ప్రతినెల అందించాల్సిన నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయటం కారణంగా ప్రభావం గ్రామపంచాయతీ కార్మికులపై పడుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

**మండల పంచాయతీలలో 75 మంది కార్మికులు పని చేస్తున్నారు..**

**తెల్లారు జాము నుంచి సాయంత్రం వరకు..**

గ్రామాలలో నిరంతరం ఉదయం తెల్లవారుజామున నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్మికులు మురికి కాలువలు శుభ్రం చేయడం రోడ్లపై ఉన్న చెత్త చెదరం ఉడిసివేయడంతో పాటు గ్రామాలలో చెత్త సేకరణ వాహనంలో వెళ్లి చెత్త సేకరణ చేయడం చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం, అలాగే హరితహారం కింద నాటిన మొక్కలకు నీళ్ల పట్టించడం వివిధ రకాల పనులు చేపడుతున్న పంచా యతీ కార్మికుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. తక్కువ వేతనం పనులు ఎక్కువ ఉన్నా పనులు చేస్తూ కుటుంబ పోషణ కోసం కార్మికులుగా మారి రోజువారీగా గ్రామాల్లో శుభ్రం పనులు చేస్తున్నామని, కానీ మూడు. నెలలు అవుతున్న వేతనాలకోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొన్నదని కార్మికులు వాపోతున్నారు.

**రోజువారి ఇంట్లో సరుకులకు తిప్పలు..**

ఉద్యోగికి ఒక నెల వేతనం రాకపోతేనే తీవ్రఇబ్బందులు ఎదురవుతుంటాయి. రోజువారి ఇంట్లోకి సరుకులు పిల్లల ఫీజులతో ఇతరాత్ర ఖర్చుల కోసం తిప్పలు పడుతుంటారు. కాని కార్మికులకు మూడు నెలలుగా జీతాలు జాడ లేకుండా పోయింది. కార్మికులు పరిస్థితి ఏ మేరకు ఉంటుందో ఊహించుకోవచ్చని కార్మికులు పేర్కొంటున్నారు.

**అధికారులకు తెలిపిన..**

ప్రతినెలా కార్మికుల అకౌంట్లో వేతనాలు జమ అవుతాయని కార్మికుల ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడం జరిగిందని కార్మికులు పేర్కొంటున్నారు. మండలంలోని సంబంధిత ప్రభుత్వ అధికారులకు కలిసి మరో పక్క మండల అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు తమకు వేతనాలు సకాలంలో అందటం లేదని, వారిదృష్టికి తీసుకవెళ్లిన అధికారుల నుంచి తమకు సరైన సమాధానం రావడం లేదని, మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనం వెంటనే చెల్లించాలని ప్రభుత్వ వెంటనే స్పందించి తమకు ప్రతినెల వేతనాలు వచ్చే విధంగా చూడాల్సిందిగా ప్రభుత్వానికి కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆర్థిక ఇబ్బందులు..**



కార్మికులకు వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది కరంగా మారింది. ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి ప్రతినెలా వేతనాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

**కార్మికుడు బాలయ్య, ధన్వాడ కారోబార్**

**వేతనాలు వెంటనే చెల్లించాలి..**



గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. వారి పిల్లలు చదువుకోవడానికి స్కూల్ బ్యాగులు నోట్స్‌లు కొనడానికి డబ్బులు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులకు ప్రతినెలా వారి అకౌంట్లో వేతనాలు వెయ్యాలి. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

**బొదిగెలి శ్రీనివాస్,**
**బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు**

**ప్రతి నెల వేతనలు ఇవ్వాలి..**



గ్రామాల్లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారికి మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి. ప్రతినెలా వేతనాలు ఆకౌంట్లో పడేవిధంగా చూడాలి.

**టీయుసిఐ జిల్లా కార్యదర్శి బి. రాము**

## 1,50,00క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**- జూరాల 12గేట్ల ద్వారా దిగువకు నీటివిడుదల**



29ఎంబీఎన్ఆర్ 55: జూరాల డ్యాం నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

**మహబూబ్‌గర్‌బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** జూరాల జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెత్తడంతో జూరాల నిండుకుండలా మారింది. దీంతో 12గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసా గుతున్నది. ఆదివారం జూరాలకు 150,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 7.279 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్‌కు 25,785 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 1,16,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిప్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడవ కాలువకు 150 క్యూసెక్కులు, కుడి కాలువకు 290 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా పవర్‌హౌజ్‌కు 25785 క్యూసెక్కుల నీటిని విడుద చేశారు. జూరాల నుంచి 143656 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## జోగులాంబ దేవికి బోనాల సమర్పణ



ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి

**మానవపాడు, జూన్ 29 ప్రభాతవార్త :** దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ శైవ క్షేత్రం అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన ఐదవ శక్తిపీఠం పీఠమైన అలంపురం శ్రీ జోగులాంబ దేవి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాడ మాసం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలోని వెలసిన నల్ల పోచమ్మ మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జోగులాంబ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు సుమారు 500 మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒక వెండి బోనం, 50 బోనాలతో సుమారు 500 మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని పురవీధుల గుండా వివిధ రూపాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తూ నృత్యాలు చేస్తూ భక్తి పారవశ్యంతో కన్నుల పండుగగా అమ్మవారి ఆలయానికి చేరుకుని జోగులాంబ మాత దేవికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అధికారులు అమ్మవారి సన్నిధిలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్ తదితరులు పాల్గొన్నారు.